క్లుప్తంగా

హామీలు అమలు చేయకపోతే ఆందోళన



అమరచింత: మున్సిపాలిటీ కేంద్రంలో డిగ్రీ, జూనియర్ కాలేజీ నిర్మించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతూబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంతో పాటు మున్సిపాలిటీ కేంద్రంలో గత కొన్ని ఏళ్లుగా ప్రభుత్వ ఇంటర్ కళాశాల లేకపోవడం ద్వారా పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఆత్మకూర్, వనపర్తి, గద్వాల, మహబూబ్‌నగర్ పట్టణాలను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండలంలో ప్రభుత్వపరంగా డిగ్రీ కళాశాలతో పాటు ఇంటర్ కాలేజీ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చిన మంత్రి వాకిటి శ్రీహరి తన హామీని వెంటనే నెరవేర్చాలన్నారు. ఈ విద్యాసంవత్సరం ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన మంత్రి కార్యరూపంలోకి తీసుకురావడం లేదన్నారు. ఇచ్చిన హామీప్రకారం ప్రభుత్వ డిగ్రీ, ఇంటర్ కళాశాలలను ఏర్పాటు చేయకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనురాగ్, విజయ్, నసీర్ పాల్గొన్నారు.

'దేశభక్తిపై మాట్లాడే నైతికహక్కు బీజేపీకి లేదు'




వనపర్తి రూరల్: దేశభక్తిపై మాట్లాడే నైతిక హక్కు బీజేపీకి లేదని, నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులని సీపీఐ అని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కమ్యూనిస్టులను ఏరివేస్తామని, వారి దేశభక్తిపై కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండిసంజయ్ చేసిన వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. 1925 డిసెంబర్ 26న ఉత్తర్‌ప్రదేశ్ కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ పురుడు పోసుకుందన్నారు. అప్పుడే ఆర్‌ఎస్‌ఎస్ కూడా పుట్టిందన్నారు. దేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని తొలిసారి డిమాండ్ చేసింది కమ్యూనిస్టులేనన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌లో ఎవరూ కూడా స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొనలేదని, దేశభక్తి గురించి మాట్లాడే నైతికహక్కు వారికి లేదన్నారు.ఆపరేషన్ కంగారు పేరుతో మార్చి 2026 నాటికి కమ్యూనిస్టులను ఏరిపారేస్తామని ఆయన చెప్పడం దుర్మార్గమన్నారు. ఎర్రజెండాను అంతంచేసే శక్తి బీజేపీకి లేదన్నారు. ఆయన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ, శ్రీరామ్, రమేష్, మోష, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ప్రభుత్వ సాయం



వనపర్తి రూరల్: మండలంలోని అంకూరు గ్రామంలో గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న కొమ్ము రాములు శనివారం గ్రామంలోని రైతువేదిక దగ్గర ఉన్న మురుగు కాల్వ శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు బోర్లపడి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీడీఓ రవీందర్‌బాబు ఆదివారం గ్రామంలో వారిఇంటికి వెళ్లి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంతక్రియలకు రూ.10వేలను ఎంపీడీఓ వారి కుమారుడు కొమ్ము వెంకటేష్‌కు అందజేశారు.

ఆర్‌ఎంపీ అదృశ్యం



ఆత్మకూర్: మండలంలోని మూలమల్ల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు వడ్ల వెంకటరమణాచారి కనిపించకుండా పోయాడని భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నరేందర్ తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకుల మండలం రాచాల గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రమణాచారి కుటుంబంతో కలిసి మూలమల్ల గ్రామంలో నివాసముంటున్నారు. ఈ నెల 9న ఆత్మకూర్‌లో బ్యాంకుకు వెళ్లి వస్తానని చెప్పి నేటివరకు రాకపోవడంతో బంధువుల వద్ద ఆరాతీసిన ఆచూకి లభించకపోవడంతో ఆదివారం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



వెంకటాంపల్లి గ్రామ శివారులో..



సల్కెలాపురంలో నిండు కుంటను తలపిస్తున్న ఉప్పరివాని చెరువు

ఖిల్లాలో చెరువులు కళకళ

- మత్తడి దూకుతున్న చెక్‌డ్యాంలు
- నిండుకుండల్లా చెరువులు



ఖిల్లాఘనపురం మండలం అప్పారెడ్డిపల్లి శివారులో మత్తడి దూకుతున్న చెక్‌డ్యాం



రుక్కన్నపల్లిలో గంగనమోని చెరువు..

మండలంలో గత వారం రోజులుగా జోరుగా వాన కురుస్తుంది. వానాకాలం ప్రారంభం తరువాత మధ్యలో తీవ్రంగా ఎండలు కాయడంతో మెట్టపంటలు వాడుముఖం వేశాయి. ఇంతలోనే మండలంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో వాగులు, వంకలు పొంగి పొరుతున్నాయి. చెరువులు పూర్తి స్థాయిలో నిండి నిండుకుండల్లా దర్శన మిస్తున్నాయి. వాగులు పారడంతో వాననీరు నిలిచి భూగర్భజలాలు పెంచేందుకు మండలంలో నిర్మించిన చెక్‌డ్యాములు నిండి దూకుతున్నాయి. పనులు జరుగుతున్నందున ఖిల్లాఘనపురం గణపసముద్రం రిజర్వాయర్‌కు నీరు రాకుండా చేయడంతో నిండలేదు. ఈ ఒక్క చెరువు మినహా మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన చెరువులు పూర్తి స్థాయిలో నిండాయి. చెరువుల కింద సాగు చేసిన పంటలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీళ్లు పుష్కలంగా రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– ఖిల్లాఘనపురం

'తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మరు'



మాట్లాడుతున్న కృష్ణ

వనపర్తిటౌన్: ప్రజలను మెప్పించేందుకు తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజాక్షేత్రంలో ఎవరికి ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలకు తెలుసని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు పాకననాటి కృష్ణ అన్నారు. నిజాలు వెలుగులోకి వస్తే ప్రజల్లో ఉన్న విలువ పోతుందనే విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. 20వ వార్డులో తాగునీటి బోర్ బావి, సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఎమ్మెల్యే మేఘారెడ్డి చొరవతో నిర్మిస్తుంటే బీఆర్‌ఎస్ నాయకులు మేమే అభివృద్ధి చేస్తున్నట్లు తప్పుడు ప్రచారాం చేస్తుడం సరికాదన్నారు. ఈ మేరకు ఆదివారం జిలా కేంద్రంలోని 20వ వార్డుల్లోని పలు కాలనీల్లో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి, ప్రజలకు వాస్తవాలు వివరించిన అనంతరం ఆయన మాట్లాడారు.. ప్రజల మధ్యలో ఉండాలనుకునే నాయకులు ప్రజలకు దగ్గరయ్యేందుకు సొంత నిధులతో ప్రచారం చేసుకుంటే తప్పు లేదని, అధికార పార్టీ చేస్తున్న పనులను కూడా అపహాస్యం చేయడం తగదన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలకు తెగబడితే సహించబోమని, కలివిడిగా ఉన్న రాజకీయాలను కలుషితం చేయొద్దని హితవు పలికారు. బీఆర్‌ఎస్ హయంలో నిధులు వస్తే ఇన్ని రోజులు పనులు చేయకుండా ఎవరూ అడ్డంగిచారని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలకు దిగితే ఇకపై సీరియస్‌గా స్పందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా కాలనీల ప్రజలు తదతరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..



మూలమళ్ల-నందిమళ్ల గ్రామాల మధ్య ఎడమకాల్వ వెంట దెబ్బతిన్న వంతెన

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమకాల్వ వెంట రామన్‌పాడ్ రిజర్వాయర్ వరకు ఉన్న కాల్వపై నిర్మించిన వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కాల్వ వెంట ఉన్న కచ్చా రహదారిపై ఆటోలు, ట్రాక్టర్‌లు, ద్విచక్ర వాహనదారులు నిత్యం ప్రయాణం చేస్తుంటారు. ఈ క్రమంలో ముందున్న ప్రమాదం గుర్తించక కాల్వలో పడి ప్రాణాలు కోల్పోతున్న పరిస్థితులు చోటు చేసుకుంటున్నాయి. మూలమళ్ల- నందిమళ్ల గ్రామాల సమీపంలో ఉన్న ఎడమకాల్వ వద్ద వంతెన దిమ్మెలు కూలిన అధికారులు పట్టించుకోలేక పోతున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటాయో అని ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు కాల్వ వెంట శిథిలానికి చేరిన వంతెనలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, ఎడమకాల్వ ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

పొంచిఉన్న ప్రమాదం..



ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగజాతి మొక్కలు

పాన్‌గల్: మండలంలోని అన్నారంతండా సమీపంలో ప్రధానరోడ్డు సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెద్ద చెట్లు, తీగ మొక్కలు అల్లుకొని ప్రమాదకరంగా మారింది. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పక్కల గడ్డిపొదలు, పిచ్చిమొక్కలు నిండుగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ పరిసరాలకు మూగజీవాలకు మేతకోసం వెళితే ప్రమాదం చోటుచేసుకునే అవకాశం ఉంది. దీంతోపాటు వర్షాకాలం సీజన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని తండా వాసులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న తీగజాతి మొక్కలు, పరిసరాలల్లో ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి ప్రమాదాలు కాకుండా తగుచర్యలు తీసుకోవాలని తండా వాసులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడి ఊరేగింపు



మద్దిగట్ల గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఊరేగింపు చేస్తున్న భక్తులు



పెద్దమందడిలో శ్రీకృష్ణుడి ప్రతిమతో ఊరేగిస్తున్న భక్తులు

కొత్తకోట రూరల్: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక పెద్దమందడి, మద్దిగట్ల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం పెద్దమందడి, మద్దిగట్ల గ్రామాల్లో వేరువేరుగా ఆయాగ్రామాల్లో ప్రత్యేక పూజలతో భక్తులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం శ్రీకృష్ణుడి ప్రతిమను గ్రామవీధుల గూండా ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా భగవద్గీత శ్లోకాలతో గ్రామంలోని వీధులన్నీ మార్మోగించారు. కార్యక్రమంలో పెద్దమందడి, మద్దిగట్ల ఉత్సవ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేత



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ నాయకుల

కొత్తకోట రూరల్: కొత్తకోట పట్టణ కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మేస్త్రీ శ్రీనివాసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో పార్టీలకతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. ప్రజాపాలనలో పైరవీలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారులకు సహాయం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ఎజాజ్ అలీ, బాలకృష్ణ, మేరాజ్, నరేంద్రసాగర్ పాల్గొన్నారు.

దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోష

వనపర్తి రూరల్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాల్లో పనిచేస్తున్న స్వీపర్లు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రభుత్వ పాఠశాలల స్వీపర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోష అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్న జిల్లా స్వీపర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దళారుల పైరవీలతో సమస్యలు పరిష్కారం కాదన్నారు. ఉద్యోగాలను రెగ్యులర్ చేస్తామని కొందరు ఒక్కొక్క స్వీపర్ దగ్గర రూ.5,200 వసూలు చేశారన్నారు. మోసగాళ్లపై పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. యూనియన్ పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. 12 నెలల పెండింగ్ వేతనం పొందగలిగామన్నారు. కొందరి జీతం రూ.1,623, మరికొందరికి రూ.4వేలు, ఉండేదని పోరాటాలతో ప్రభుత్వం రూ.5,200కు పెంచిందన్నారు. ఉద్యోగాల రెగ్యులర్‌తో పాటు కనీసవేతనం రూ.26 వేలు ,ప్రతినెలా ఒకటో తేదీన వేతనం కోసం పోరాటం సాగిద్దామన్నారు. ఐక్యంగా ఉంటేనే సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరామ్, భాస్కర్, సీపీఐ పట్టణ కార్యదర్శి రమేష్, లక్ష్మీనారాయణ, స్వీపర్లు తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ మరమ్మతు చేపట్టరూ..



తాగునీటి పైపులైన్ లీకేజీతో వృథా అవుతున్న నీరు

పాన్‌గల్: మండలంలోని దొండాయిపల్లి గ్రామంలో తాగునీటి పైపులైన్ లీకేజీ అవుతూ తాగునీరు వృథా అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పాషా ఇంటి సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ గత కొన్నినెలల నుంచి లీకేజీ అవుతూ తాగునీరు వృథా అవడమే కాకుండా ఆ పరిసరాలు బురదమయమై పాకరపట్టింది. ఈ ప్రాంతం గూండా వృద్ధులు నడిచే క్రమంలో జారీ పడే ప్రమాదం ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. ముందు వర్షాకాలం కావడంతో పైపులైన్ లీకేజీ ప్రాంతంలో వర్షపునీరు చేరి తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని గ్రామ కార్యదర్శికి విన్నవించిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాముడును వివరణ కోరగా పైపులైన్ లీకేజీ అవుతున్నది వాస్తవమేనని జీపీలో నిధులు లేక మరమ్మతు విషయంలో జాప్యం అవుతుందని త్వరలోనే లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటివృథాను అరికడతామని తెలిపారు.

ఊరు పేరుకు నోచుకోని బస్టాండ్



అమరచింత: మండలకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌పై ఊరు పేరు రాయకుండా వదిలేయడంతో పట్టణం మీదుగా వెళ్తున్న ఇతర ప్రాంతాలకు చెందిన ప్రయాణికులు ఈ ఊరి బస్టాండ్‌కు పేరు లేదేమో చర్చించుకుంటూ వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. శిథిలావస్థకు చేరిన బస్టాండ్ మరమ్మతులు, కలరింగ్ పనుల కోసం నిధులను మంజూరు చేశారు. పనులు చేసిన కాంట్రాక్టర్ ఊరి పేరును రాయడం వదిలేశాడు. అధికారులు స్పందించి ఊరిపేరు రాయించాలని కోరుతున్నారు.

అధ్వాన రహదారితో అవస్థ

- పనులకు రూ.2.60 కోట్లు మంజూరు
- రెండేళ్లు కావొస్తున్నా పూర్తికాని పనులు
- ఇబ్బందుల్లో ప్రయాణికులు, ప్రజలు



వర్షపునీటితో కరిగెటను తలపిస్తున్న ఖిల్లాఘనపురం- పర్వతాపురం రోడ్డు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం నుంచి పర్వతాపురం, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, సల్కెలాపురం గ్రామాల మీదుగా భూత్పూర్ మండలం వెల్కిచెర్ల గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ఎంతకు పూర్తికాకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుకు పూర్తిగా గోతులు ఏర్పడటంతో గతంలో ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ రెడువైపులా మట్టిపోసి ఉన్న కొద్దిపాటి బీటీ తీసివేయడంతో వర్షపు నీరు నిలిచి వరినాటు వేసే కరిగెటను తలపిస్తుంది. ఆయా గ్రామాలకు వెళ్లాలంటేనే ప్రమాదాలు తప్పవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.2.60 కోట్లు మంజూరు..

ఖిల్లాఘనపురం నుంచి పర్వతాపురం మీదుగా వెళ్లే బీటీ రోడ్డు రినివల్ పనులకు ప్రభుత్వం ఆర్‌అండ్‌బీ నిధులు రూ.2.60కోట్ల నిధులు మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కల్వర్టు పనులు చేసి వదిలేశాడు. ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో కొంత దూరం రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి వదిలేశాడు. ఇక అంతటితో పనులు నిలిపివేశాడు.

ఇబ్బందుల్లో వాహనదారులు..

మండలకేంద్రం నుంచి పర్వతాపురం వరకు ఉన్న 6 కిలో మీటర్ల బీటీరోడ్డుకు గుంతలు ఏర్పడ్డాయి. గుంతలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. రోడ్డుకు ఇరువైపులా మొరం పోసి వదిలేయడంతో పెద్ద వాహనాలు వస్తే ఎదురుగా చిన్న వాహనాలు వెళ్లడానికి వీలులేకుండా పోయింది. ఇటీవల ఎక్కువ వర్షం పడుతుండటంతో రోడ్డు కాస్త నీటి మడుగులను తలపిస్తుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుని రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చాలా ఇబ్బందిగా ఉంది

మా గ్రామం నుంచి ఖిల్లాఘనపురం ప్రతిరోజూ వేలసంఖ్యలో ప్రజా అవసరాల నిమిత్తం వెళ్తుంటాం. రోడ్డుపూర్తిగా పాడైపోవడంతో ఇబ్బందిగా మారింది. రోడ్డుకు చాలా చోట్ల మొరం పోసి వదిలేశారు. ద్విచక్రవాహనంపై వెళ్తుంటే కిందపడి గాయాలయ్యాయి. కాంట్రాక్టర్ రెండేళ్లు కావొస్తున్న రోడ్డు పనులు పూర్తి చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పనులు పూర్తి చేయించాలి.

– రవినాయక్ వెనికితండా..

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

ఖిల్లాఘనపురం నుంచి వెల్కిచెర్ల వరకు ఉన్న బీటీరోడ్డు పనులను రెండు భాగాలుగా ప్రభుత్వం టెండర్ పిలిచామన్నారు. ఇప్పటివరకు ఓ భాగం రోడ్డు పనులు పూర్తి చేశాం. ఖిల్లాఘనపురం నుంచి పర్వతాపురం వరకు ఉన్న రోడ్డు పనులను కాంట్రాక్టర్ చేయడం లేదు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రోడ్డు పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

–రాఖేష్, ఏఈ ఆర్‌అండ్‌బీ శాఖ..

మైసమ్మ జాతరకు తగ్గిన భక్తులు



మైసమ్మ జాతర పూజల్లో పాల్గొన్న భక్తులు

పెద్దకొత్తపల్లి: నాయినోనిపల్లి మైసమ్మ జాతరకు ఆదివారం భక్తులు తక్కువ సంఖ్యలో హాజరై మైసమ్మ దేవతను దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వారం రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా భక్తులు తగ్గినట్లు ఎండోమెంట్ అధికారి రామేశ్వర్‌శర్మ పేర్కొన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డా.పగిడాల శ్రీనివాసులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో సన్మానించారు. మత్స్యకార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మౌలాలి, బురాన్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు అప్రమత్తంగా ఉండాలి

పెంట్లవెల్లి: ఇటీవల కరుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రామన్‌గౌడ్ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండొద్దన్నారు. ఇనుప స్తంభాలను తాకొద్దని, చెట్లకిందకు వెళ్లొద్దని, విద్యుత్ మోటర్‌ల దగ్గర జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదేవిదంగా నది పరివాహక ప్రాంతాలలో ఉండే జటప్రోల్, మల్లేశ్వరం, మంచాలకట్ట గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎప్పటికప్పుడు అధికారులు కూడా అపరమత్తంగా ఉండి పరిస్థితిని చూడాలన్నారు. అత్యవసర సమయంలో 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.